# సాక్షి
## కాకినాడ

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024







**అభీష్ట సిద్ధి.. అనుగ్రహ ప్రాప్తి..**
అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో సుదర్శన హోమం చేయించుకుంటే కోర్కెలు నెరవేరుతాయని భక్తులు భావిస్తారు.

8లో



**రూ.55 వేల విరాళం**
గోకవరం: స్థానిక శ్రీ స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి నంగినీడి రాంబాబు, కుమారుడు శివాజీ గణేష్, కోడలు శ్రీవాణిదుర్గ (దేవీపట్నం పునరావాస కాలనీ) రూ.55 వేల విరాళం అందించారు.

**డెల్టాలకు 10,200 క్యూసెక్కులు**



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 17,382 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### 'దేవదాయ, ధర్మాదాయ శాఖను రద్దు చేయాలి'

**హిందూ అభయసేన అధ్యక్షుడు స్వామి రాధామనోహర్‌దాస్**



కడప: గుడులను, గుడుల్లో లింగాలను మింగేస్తున్న రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖను రద్దు చేయడమే శ్రేయస్కరమని హిందూ అభయసేన అధ్యక్షుడు స్వామి రాధామనోహర్‌దాస్ అన్నారు. ఈ శాఖను రాక్షస శాఖ, ధర్మనాశన శాఖగా అభివర్ణించారు. దేవాలయాల నిర్వహణ హిందువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కడప మండలం అరట్లకట్ట గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యాన వచ్చే నెల 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను విజయవంతం చేసేందుకు ప్రతి హిందువూ తరలిరావాలని పిలుపునిచ్చారు. హిందువులను కులాల వారీగా విడగొట్టే రాజకీయాలు మానుకోవాలన్నారు. గడప లోపలే కులాన్ని ఉంచుకోవాలని, గడప దాటితే హిందువని గర్జించాలని సూచించారు. హైందవ జాతి సంఖ్య తగ్గిన చోటనే హిందువులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, ఇందుకు పాకిస్తాన్, బంగ్లాదేశ్, మన దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఉదాహరణగా నిలుస్తాయని వివరించారు. అక్కడ కులం పేరు చూసి కాకుండా హిందువు అంటే చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ ఎడారి మతాలకు దూరంగా ఉండి, విజయవాడ సభకు తరలివచ్చి హిందువులు ఇంకా బతికే ఉన్నారని చాటిచెప్పాలని రాధామనోహర్‌దాస్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు వెలుగుబంట్ల శ్రీనివాస్, యరమాటి సతీష్, బ్రహ్మాజీ, కె.పెద్ద అప్పాజీ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థి దశలో లక్ష్య సాధనకు కృషి చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి దశలో లక్ష్యాలు ఏర్పరచుకుని, వాటి సాధనకు కృషి చేయాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకే సీఎస్ఈ విభాగం ఆధ్వర్యాన వారం రోజుల పాటు నిర్వహించే జనరేషన్ ఏఐ ఫర్ డేటా అనలిటిక్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. సరికొత్త ఆలోచనలు, స్నేహితులతో చర్చించుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రపంచ మార్కెట్ భారత్ వైపు చూస్తోందని, దానిని అందిపుచ్చుకునేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ఇటువంటి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉత్పత్తులను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, సీఎస్ఈ విభాగాధిపతి ఎస్.రామకృష్ణయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉషాదేవి, ఎస్.సురేఖ పాల్గొన్నారు.

### పింఛన్ల సర్వే 92 శాతం పూర్తి



పింఛన్లపై సర్వే చేస్తున్న ప్రత్యేక బృందాలు

తుని రూరల్: పింఛన్ల లబ్ధిదారుల అర్హతలను గుర్తించేందుకు జిల్లాలోని తుని మండలం రేఖవానిపాలెంలో సోమవారం ప్రయోగాత్మకంగా నిర్వహించిన సర్వే 92 శాతం పూర్తయ్యింది. డీఎల్‌డీఓ కేఎస్‌వీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఇతర మండలాలకు చెందిన 11 మంది గెజిటెట్ అధికారులు, మరో 11 మంది సచివాలయ సిబ్బంది ఈ సర్వే నిర్వహించారు. ఒక్కో బృందానికి 40 మంది పింఛన్‌దార్లను కేటాయించారు. పంచాయతీ పరిధిలోని రేఖవానిపాలెం, మరువాడ గ్రామాల్లో వృద్ధాప్య పింఛన్లు 212, వితంతు పింఛన్లు 120, ఒంటరి మహిళలు 8, అభయ హస్తం 5, చేనేత 1, కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఒకరు చొప్పున మొత్తం 433 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 399 మందికి సంబంధించి సర్వే పూర్తయ్యిందని డీఎల్‌డీఓ ప్రసాదరావు తెలిపారు. మరో 34 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో సర్వే జరగలేదన్నారు. కలెక్టర్ ఆదేశించిన తర్వాత ఈ 34 మందిపై సర్వే నిర్వహిస్తామన్నారు. సర్వేలో భాగంగా ఆయా లబ్ధిదారుల బయోమెట్రిక్‌తో ట్యాబ్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్‌లోని పది ప్రశ్నలు పూర్తి చేశామని చెప్పారు. ఆయా వర్గాలకు సంబంధించి వివిధ సర్టిఫికెట్లను పరిశీలించి, అవసరమైన నకళ్లను సర్వే బృందాలు సేకరించాయని తెలిపారు.

# విజేత.. భీమవరం బుల్లోడే!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి
- తొలి ప్రాధాన్య ఓట్లలోనే గెలుపు
- బడి నుంచి మండలికి పయనం
- ఆరు గంటల్లోనే ముగిసిన ఓట్ల లెక్కింపు

**ఎవరికెన్ని ఓట్లంటే..**

| | |
|---|---|
| బొర్రా గోపిమూర్తి | 9,165 |
| గంధం నారాయణరావు | 5,259 |
| దీపక్ పులుగు | 102 |
| నామన వెంకటలక్ష్మి (విళ్ల లక్ష్మి) | 81 |
| డాక్టర్ నాగేశ్వరరావు కవల | 73 |



టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తికి ధ్రువపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి షణ్మోహన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉత్కంఠగా సాగిన గురువుల పోరులో భీమవరం బుల్లోడు విజేతగా నిలిచారు. ఆరు జిల్లాల పరిధిలో హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి గెలుపొందారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల బరిలోకి దిగేందుకు తన వృత్తికి రాజీనామా చేశారు. గోపిమూర్తికి ప్రధాన ప్రత్యర్థిగా ద్రాక్షారామకు చెందిన గంధం నారాయణరావు బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచినప్పటికీ మిగిలిన ముగ్గురూ నామమాత్రమైన పోటీకే పరిమితమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి చివరి వరకూ బొర్రా, గంధం మధ్యనే నువ్వా నేనా అనే స్థాయిలో పోటీ కనిపించింది. చివరకు యూటీఎఫ్, పీడీఎఫ్ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగిన గోపిమూర్తికి విజయం వరించింది. గత ఎన్నికల్లో సైతం నారాయణరావు పీడీఎఫ్ అభ్యర్థితో తలపడ్డారు.

**సాబ్జీ మృతితో..**

శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గానికి రెండున్నరేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందిన సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. మిగిలిన రెండున్నరేళ్ల పదవీ కాలానికి ఎన్నికల కమిషన్ ఈ ఎన్నిక నిర్వహించింది.

**ఆది నుంచీ ఉత్కంఠగా..**

ఈ ఎన్నికలు ఆది నుంచీ తీవ్ర ఉత్కంఠను రేకెత్తించాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు (రంపచోడవరం) జిల్లాల్లో విస్తరించి ఉన్న ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు 15,494 ఓట్లు పోలయ్యాయి. చెల్లుబాటు అయిన మొత్తం ఓట్లను ప్రామాణికంగా తీసుకుని కోటా ఓట్లను 7,341గా నిర్ణయించారు. గోపిమూర్తికి తొలి రౌండ్‌లోనే కోటా ఓట్లు దక్కాయి. దీంతో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఎన్నికల కమిషన్ ఆమోదంతో ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. గోపీమూర్తికి 9,165 ఓట్లు పోలవగా, రెండో స్థానంలో ఉన్న నారాయణరావు 5,259 ఓట్లు దక్కించుకున్నారు. దీంతో 3,906 ఓట్ల ఆధిక్యతతో గోపిమూర్తిని విజయం వరించింది. యూటీఎఫ్, పీడీఎఫ్ ఉమ్మడిగా బలపరిచిన గోపీమూర్తి వెంట ఆ రెండు సంఘాల ప్రతినిధులు విస్తృత ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. సిట్టింగ్ స్థానంపై పట్టు సాధించాలని ఉపాధ్యాయులు కలసికట్టుగా పని చేసినా.. ప్రధాన పోటీదారుగా నిలిచిన గంధం నారాయణరావు చివరి వరకూ గట్టి పోటీయే ఇచ్చారు. రెండున్నరేళ్ల పదవీ కాలానికి జరిగిన ఈ ఎన్నికల్లో పీడీఎఫ్ చివరకు తన స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది.

ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్, కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బరిలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. 14 టేబుళ్లపై 76 మంది సిబ్బంది ఓట్ల లెక్కింపు చేపట్టారు. కాకినాడ ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, అర్బన్ తహసీల్దార్ జితేంద్ర పాల్గొన్నారు.

**తొలి రౌండ్‌లోనే...**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఆరు గంటల్లోనే ముగిసింది. కాకినాడ జేఎన్‌టీయూ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు మొదలై, మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. తొలి రౌండ్‌లోనే మొదటి ప్రాధాన్యతా ఓట్లకే కోటా ఓట్లు రావడంతో గోపిమూర్తిని విజయం వరించింది.



కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపు హడావుడిలో సిబ్బంది



చెల్లుబాటు కాని ఓట్లను ఏజెంట్లకు చూపుతున్న సిబ్బంది



కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్, రిటర్నింగ్ అధికారి షణ్మోహన్



విజయ చిహ్నం చూపిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

**ఉపాధ్యాయుల వాణి వినిపిస్తా..**

ఓట్ల లెక్కింపు అనంతరం గోపిమూర్తి మీడియాతో మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వాణిని మండలిలో వినిపిస్తానని చెప్పారు. సీపీఎస్ రద్దు పోరాటానికి మద్దతుగా ఉద్యమంలో ముందుంటానని, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రం అందుకున్న అనంతరం మద్దతుదార్లతో కలసి కాకినాడ యూటీఎఫ్ హోం వరకూ గోపిమూర్తి ర్యాలీగా వెళ్లారు.

**గురువుల ఓట్లు చెల్లలేదే!**

ఉపాధ్యాయులంటే సమాజానికి మార్గనిర్దేశకులుగా పేర్కొంటారు. అటువంటి గురువులు వేసిన ఓట్లే చెల్లుబాటు కాకపోవడం విస్మయం కలిగించింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసేసరికి ఏకంగా 814 ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు. ఓటింగ్‌పై అవగాహన లేనందువల్లనో లేక నిరక్షరాస్యత కారణంగానో సాధారణ ఎన్నికల్లో చెల్లని ఓట్లు ఉండడం సహజం. కానీ, స్వయంగా చదువుకుని, నలుగురికీ చదువు చెప్పే గురువుల ఓట్లే చెల్లుబాటు కాకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది.

### వీరికి ఎన్నికల కోడ్ వర్తించదా?

- పిఠాపురంలో టీడీపీ హైడ్రామా
- కౌంటింగ్ రోజునే ఎన్నికల కోడ్ ఉల్లంఘన
- పట్టించుకోని అధికారులు



పిఠాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పిఠాపురం: పట్టణంలో టీడీపీ నేతలకు చట్టం చుట్టంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. 144 సెక్షన్ సైతం అమలులో ఉంది. ఈ నేపథ్యంలో ఎవరైనా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, అటువంటిదేమీ లేకుండానే టీడీపీ పిఠాపురం నియోజకవర్గ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ సోమవారం పిఠాపురంలో యథేచ్ఛగా సవాళ్లు విసురుతూ, టీడీపీ జెండాలతో పట్టణ వీధుల్లో ప్రదర్శన, ఉప్పాడ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. కాకినాడ సెజ్ భూములకు సంబంధించి వైఎస్సార్ సీపీ నేతలు చర్చకు రావాలంటూ ఈ సమావేశంలో సవాళ్లు విసిరారు. ఒకపక్క కాకినాడలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ జరుగుతోంది. అయినప్పటికీ పిఠాపురంలో ఎన్నికల కోడ్‌ను టీడీపీ నేతలు తుంగలో తొక్కినా అధికారులు, పోలీసులు పట్టించుకోకపోగా బందోబస్తు నిర్వహించడమేమిటని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఎన్నికల సంఘం స్పందించి, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపైన, వారిని నిలువరించడంలో విఫలమైన అధికారులపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ కస్టమర్ కేర్, నాన్‌వాయిస్ కంప్యూటర్ బేసిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎనిమిదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని తెలిపారు. వివరాలకు 90107 37998 నంబరులో సంప్రదించవచ్చని సూచించారు.

# 190 మంది జీతాలకు బ్రేక్

- జీజీహెచ్‌లో ఉత్తుత్తి పోస్టుల నియామకాల ఫలితం
- లబోదిబోమంటున్న ఉద్యోగులు

కాకినాడ క్రైం: శాంక్షన్ పోస్టుల అవినీతి పాపం పండుతోంది. నర్సింగ్ పోస్టులు అమ్ముకున్న నేరంలో తాజాగా సస్పెండైన మాజీ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావు మెడపై శాంక్షన్ పోస్టుల కత్తి వేలాడుతోంది. లేని ఉద్యోగాలను సృష్టించి, అమ్మేసిన అతడి నిర్వాకానికి, అతడిని నమ్మి డబ్బు ముట్టజెప్పి ఉద్యోగాలు పొందిన కొందరి స్వయం కృతాపరాధానికి వందల మంది ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. 2021 రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉన్న పోస్టుల కంటే అదనంగా లేని ఉద్యోగాలు సృష్టించి, నిరుద్యోగులకు కట్టబెట్టిన ఆరోపణలపై గత నెల 23న ‘పోస్టులే లేవు.. భర్తీ చేసేశారు’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీంతో ఉత్తుత్తి పోస్టుల అవినీతి బాగోతం బట్టబయలైంది. కలెక్టర్ నేరుగా ఈ అవినీతిపై దృష్టి సారించారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ బృందాన్ని విచారణకు ఆదేశించారు. లేని పోస్టులు సృష్టించడం, వాటిని అమ్ముకోవడం నిజమేనని ఈ కమిటీ ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఇదే విషయాన్ని డ్రాయింగ్ అథారిటీకి నివేదించడంతో జీతాల నిలుపుదల అనివార్యమైంది. దీంతో అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 160 మంది, కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న 30 మంది మొత్తం 190 మందిపై ఈ ప్రభావం పడింది. వీరెవరికీ గత నెల జీతాలు అందలేదు. ఈ నెల ఒకటిన జమకావలసి ఉన్నా, నేటికి పది రోజులు గడుస్తున్నా ఇప్పటికీ జమ కాలేదు. ఈ 190 మందిలో ఉత్తుత్తి ఉద్యోగాలను మేనేజర్ నరసింగరావు నుంచి కొనుక్కున్నది ఎవరు, కొనసాగుతున్నది ఎవరనే విషయాలు తేలే వరకూ జీతాల చెల్లింపులు జరిగే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

### విశ్రాంతి షెడ్ల నిర్మాణానికి శ్రీకారం

అన్నవరం: రత్నగిరిపై విశ్రాంతి షెడ్ల నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. మొదటి ఘాట్ రోడ్డు వద్ద రూ.60 లక్షలు, తూర్పు రాజగోపురం వద్ద రూ.40 లక్షలతో రాజమండ్రి పేపర్ మిల్లు సహకారంతో ఈ షెడ్లు నిర్మిస్తున్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తవుతాయని దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ సోమవారం తెలిపారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా రూ.88 లక్షలతో మరో షెడ్డు కూడా నిర్మించనున్నారు.

## గాలికొదిలేసిన కూటమి హామీలే అజెండా

- నేడు వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమావేశం
- ముఖ్య అతిథిగా పాల్గొంటున్న రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం కాకినాడలో మంగళవారం జరగనుంది. స్థానిక సూర్య కళా మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పార్టీ ఉభయ గోదావరి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు సోమవారం ఈ వివరాలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న పార్టీ తొలి సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నామని చెప్పారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజల తరఫున నిర్వహించే పోరాటాలపై ఈ సమావేశంలో చర్చించనున్నామని తెలిపారు. ఈ నెల 13న రైతు సమస్యలపై కలెక్టరేట్ల వద్ద నిరసన, 27న విద్యుత్ చార్జీల పెంపుపై ఎస్ఈ కార్యాలయాల వద్ద, జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మాట తప్పిన కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా నిర్వహించే ఆందోళనలపై ఈ సమావేశంలో చర్చించనున్నామని వివరించారు. వీటితో పాటు సార్వత్రిక ఎన్నికల్లో ఎడాపెడా ఊదరగొట్టి, గాలికొదిలేసిన సూపర్‌సిక్స్ హామీలు, భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ అడ్డగోలుగా సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ, పార్టీ కమిటీల నియామకాలపై కూడా చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్య నేతలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని కన్నబాబు విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు



శ్రీపాద శ్రీవల్లభ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

పిఠాపురం: దత్తాత్రేయుని అవతారంగా భక్తులు భావించే శ్రీపాద శ్రీవల్లభస్వామి జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారికి రెండో రోజైన సోమవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు పాదగయ క్షేత్రంలో కూడా దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామివారికి అర్చకులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రెండు ఆలయాల్లోనూ స్వామివార్లను వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు.

# బాబోయ్! మళ్లీ పులి

- గిత్త దూడపై దాడి చేసి హతమార్చిన వైనం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ అధికారులు
- పాదముద్రల ఆధారంగా పులిగా నిర్ధారణ
- ఆందోళన చెందుతున్న గిరిజనులు



ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్టులో లేగదూడ మృతి చెందిన స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు



అటవీ అధికారులు గుర్తించిన పులి పాదముద్ర

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు, పరిసర ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం పెద్దపులి సంచరించి స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ప్రస్తుతం అది మరచిపోయి అందరూ ప్రశాంతంగా ఉన్న తరుణంలో.. మరోసారి స్థానికంగా పులి భయం మొదలైంది. మండలంలోని బురదకోట పంచాయతీ బాపన్నధార లొద్దులోని ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్టులో పులి హల్‌చల్ చేసింది. గిత్త దూడపై దాడి చేసి హతమార్చింది. బాపన్నధార గ్రామానికి చెందిన రైతు ముర్ల వెంకట్రావు పశువులు ఎప్పటిలానే బాపన్నధార లొద్దులోకి గత శనివారం మేతకు వెళ్లాయి. ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అతడి మందలోని కొన్ని పశువులు భయాందోళనతో అరుచుకుంటూ ఇంటికి వచ్చాయి. దీంతో అనుమానం వచ్చిన రైతు సంఘటన స్థలానికి వెళ్లగా.. అక్కడ గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి చెందిన తన లేగదూడను గుర్తించాడు. దీనిపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ అధికారులు గిత్త దూడ మృతదేహాన్ని పరిశీలించి, గుర్తు తెలియని జంతువు పాదముద్రలను సేకరించారు. సంఘటన స్థలంలో అప్పట్లో నాలుగు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ ట్రాప్ కెమెరాలకు సోమవారం వరకూ ఎటువంటి ఆచూకీ లభించలేదు. గిత్తదూడ మృతదేహానికి ప్రత్తిపాడు ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ యోగేశ్వర్ పర్యవేక్షణలో పంచనామా నిర్వహించి ఖననం చేశారు.

**అది పులే..**

గిత్త దూడపై దాడి చేసి, హతమార్చిన తీరు, సంఘటన స్థలంలో లభించిన పాదముద్రల ఆధారంగా ఆ గుర్తు తెలియని జంతువు పులేనని అధికారులు నిర్ధారించారు. అడ్డతీగల మండలం గొంతీదేవి వాగులో ఇటీవల చిరుతపులి సంచరించినట్లు వార్తలు వచ్చాయి. అక్కడి నుంచి చిరుత ఈ ప్రాంతానికి వచ్చిందనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. అయితే, పాదముద్రల ఆధారంగా పెద్ద పులే దూడపై దాడి చేసినట్లు అధికారులు నిర్ధారించారు.

**ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు**


పులి సంచారం నేపథ్యంలో నియోజకవర్గంలోని ధారపల్లి, కొండపల్లి, బాపన్నధార, బురదకోట, వంతాడ, లింగంపర్తి, భద్రవరం, సిరిపురం, పేరవరం, కొండతిమ్మాపురం, పొదురుపాక, పాండవులపాలెం, తాడువాయి, పెద్దమల్లాపురం, వేళంగి, అనుమర్తి, ఆవెల్తి, ఒంద్రేగుల గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అత్యవసర పనులు ఉంటే తప్ప రాత్రి వేళల్లో బయటకు వెళ్లవద్దని హెచ్చరించారు. పొలాల్లో మకాల వద్ద పశువులను, మేకలను, గొర్రెలను ఉంచరాదని సూచించారు.

**గిరిపుత్రుల్లో గుబులు**

బాపన్నధార వద్ద పులి దాడిలో గిత్త దూడ మృతి చెందడంతో స్థానిక గిరిజనుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. అడుగు తీసి బయటకు పెట్టలేని పరిస్థితి స్థానికంగా నెలకొంది. అడవిలోకి వెళ్లి అటవీ ఉత్పత్తులు తెచ్చుకుంటేనే కానీ పూట గడవని గిరిజనులు పులి సంచరిస్తోందనే ప్రచారంతో ఇల్లు విడిచి బయటకు రాలేకపోతున్నారు. పులి ఆచూకీ వెంటనే గుర్తించి తమకు రక్షణ కల్పించాలని అటవీ అధికారులను కోరుతున్నారు.

**రెండేళ్ల క్రితం బెంగాల్ టైగర్ సంచారం**

మండలంలోని ఒమ్మంగిలో 2022 మే 24న ఓ పులి.. గేదెపై దాడి చేసి హతమార్చింది. అప్పుడు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పులి ఆచూకీ లభించింది. దానిని బెంగాల్ టైగర్‌గా అధికారులు గుర్తించారు. అప్పట్లో స్థానిక ప్రజలకు రక్షణ కల్పిస్తూ, పులిని సురక్షితంగా అటవీ ప్రాంతంలోకి తరలించేందుకు అటవీ అధికారులు రేయింబవళ్లనే తేడా లేకుండా 40 రోజుల పాటు పడరాని పాట్లు పడ్డారు. అప్పట్లో ప్రజలు, అటవీ అధికారులను బెంగాల్ టైగర్ ముప్పుతిప్పలు పెట్టింది. ప్రస్తుతం అదే బెంగాల్ టైగర్ అప్పట్లో ఏర్పాటు చేసుకున్న కారిడార్ ద్వారా తిరిగి ఈ ప్రాంతానికి వచ్చిందనే అనుమానం స్థానికంగా వ్యక్తమవుతోంది. ట్రాప్ కెమెరాలకు చిక్కితేనే అది గతంలో వచ్చిన బెంగాల్ టైగరా లేక మరో పులా అనేది నిర్ధారణ అవుతుంది. ప్రస్తుతం అటవీ అధికారులు పులి ఆచూకీ కోసం ఆరు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏలేశ్వరం ఫారెస్టు రేంజ్ అధికారి దుర్గా రాంప్రసాద్, డీఆర్‌ఓ జాన్సన్, ఫారెస్టు బీట్ అధికారి సురేష్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



రెండేళ్ల క్రితం ఫారెస్టు అధికారులు గుర్తించిన బెంగాల్ టైగర్ (ఫైల్)

# అభీష్ట సిద్ధి.. అనుగ్రహ ప్రాప్తి..

**శాశ్వత పూజల కోసం భక్తుల విరాళాలు**

| సంవత్సరం | వచ్చిన మొత్తం (రూ.లలో) |
|---|---|
| 2010-2011 | 9,32,100 |
| 2011-2012 | 17,52,800 |
| 2012-2013 | 16,85,400 |
| 2013-2014 | 15,93,800 |
| 2014-2015 | 25,96,400 |
| 2015-2016 | 25,97,100 |
| 2016-2017 | 30,13,300 |
| 2017-2018 | 29,92,300 |
| 2018-2019 | 39,22,700 |
| 2019-2020 | 41,46,500 |
| 2020-2021 | 21,50,500 |
| 2021-2022 | 30,59,100 |
| 2022-2023 | 51,04,300 |
| 2023-2024 | 63,22,200 |
| 2024-2025 | 32,19,300 |

(నవంబర్ 2024 వరకూ)



అంతర్వేది ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనారసింహ సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు(ఫైల్)

- లోక కల్యాణార్థం శ్రీ నారసింహ సుదర్శన హోమం
- 2010 నుంచి అంతర్వేదిలో నిత్యం నిర్వహణ
- 16 ఆయుధాలు, 16 భుజాలు కలిగిన స్వామి
- నవ బుధవార, నవ ప్రదక్షిణ దీక్ష నిర్వహిస్తున్న భక్తులు

**సఖినేటిపల్లి:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి నొందిన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దర్శనం జన్మ జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తారు. నవ బుధవార నవ ప్రదక్షిణ దీక్ష చేసి శ్రీనారసింహ సుదర్శన హోమం చేయించుకోవడం ద్వారా తమ సకల అభీష్టాలు, సర్వ కార్యాలు నెరవేరుతాయని నమ్ముతారు. క్షేత్రంలో స్వయం భూ గా లక్ష్మీనసింహస్వామి వెలిసినట్టు చరిత్ర చెబుతోంది. వశిష్ఠ మహర్షి ప్రార్థన కారణంగా ఇక్కడ స్వామి పశ్చిమ ముఖంగా వేంచేసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. స్వామివారి సన్నిధిలో అత్యంత పురాతనమైన 16 ఆయుధములు, 16 భుజములు కలిగిన సుదర్శన చక్రధారుడైన లక్ష్మీనరసింహస్వామికి (శ్రీసుదర్శన పెరుమాళ్) నిత్యం సుదర్శన హోమం నిర్వహిస్తున్నారు. భక్తుల మనోవాంఛా ఫలసిద్ధికి, సర్వగ్రహ దోష నివారణకు, లోక కల్యాణార్థం ఈ హోమం అత్యంత శాస్త్రోక్తంగా అర్చకులు, వేద పండితులు నిర్వహిస్తున్నారు.

**హోమం రుసుముల వివరాలు ఇలా..**

| | |
|---|---|
| ఒక రోజుకు | రూ.400 |
| ఒక నెలకు | రూ.4,000 |
| మూడు నెలలకు | రూ.10,000 |
| ఆరు నెలలకు | రూ.20,000 |
| ఒక సంవత్సరానికి | రూ.40,000 |
| శాశ్వతం(10 సంవత్సరాలు) | రూ.1,00,000 |

**2010 నుంచి...**

స్వామివారి సన్నిధిలో నిత్య శ్రీసుదర్శన హోమం ప్రారంభించక పూర్వం భక్తులు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ సొంతంగా వెచ్చించి ప్రత్యేకంగా సుదర్శన హోమం నిర్వహించుకునేవారు. అయితే కాలక్రమంలో భక్తులందరికీ సుదర్శన హోమంలో పాల్గొనే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది సమాలోచన చేసి, నిత్య శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించుకునేందుకు నిర్ణయించారు. ఇందుకు విధి విధానాలు రూపొందించాక 2010 సంవత్సరంలో హోమం ప్రారంభించారు. దశాబ్దన్నర కాలంగా నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

**వీక్షించిన మహాస్వామి :** అంతర్వేది లక్ష్మీనృసింహుని దర్శనానికి ఇటీవల విచ్చేసిన శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుదర్శన హోమం వీక్షించారు. హోమం నిర్వహణ, ఇతర అంశాల గురించి ఆలయ ప్రధాన అర్చకుడు కిరణ్.. భారతీ మహాస్వామికి వివరించారు.

## రూ.కోటి ఏడు లక్షల ఎఫ్‌డీలు



అంతర్వేది దేవస్థానంలో శ్రీనారసింహ సుదర్శన హోమంలో స్వామివారి శాశ్వత పూజల నిమిత్తం భక్తుల నుంచి ఇంత వరకూ రూ.ఒక కోటి ఏడు లక్షల ఆదాయం సమకూరింది. ఈ ఆదాయాన్ని బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో భద్రపరిచాం.

– వి.సత్యనారాయణ, అసిస్టెంట్ కమిషనర్, అంతర్వేది దేవస్థానం

## భక్తుల మనోవాంఛా ఫలసిద్ధి



భక్తులు శ్రీనారసింహ సుదర్శన హోమం నిర్వహించుకోవడం ద్వారా మనోవాంఛా ఫలసిద్ధి కలుగుతుంది. సర్వగ్రహ దోష నివారణ, లోక కల్యాణం సుదర్శన హోమంలో పూజల వల్ల సిద్ధిస్తుంది.

– పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, ప్రధాన అర్చకుడు, అంతర్వేది దేవస్థానం

## బ్రిడ్జిపై నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



రాజు మృతదేహం

**అల్లవరం:** అమలాపురం రూరల్ పేరూరు పంచాయతీ తలుపులపేటకు చెందిన అంబటి రాజు (22) బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సినిమాకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన రాజు ఆదివారం రాత్రి 10 గంటలకు బ్రిడ్జి వద్దకు వచ్చి మోటారు సైకిల్‌ని పార్కు చేసి, చెప్పులు వదిలి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే సమయంలో కొంత మంది మోటారు సైకిల్‌ను పార్కు చేసి ఉండడాన్ని గమనించారు. సోమవారం ఉదయం వరకు మోటారు సైకిల్ బ్రిడ్జి పైనే పార్కు చేసి ఉండడంతో ప్రయాణికులు గమనించి 100కి సమాచారం ఇచ్చారు. దీంతో అల్లవరం పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారులతో గాలించగా నదిలో మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. మృతుడు తండ్రి పాపారావు ఫిర్యాదుతో అల్లవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఏ కారణం వల్ల ఆత్మహత్యకు పాల్పడ్డాడో విచారణలో తెలియవలసి ఉంది. మృతుడుకి తండ్రి, తల్లి ఉన్నారు.

## 18 బోట్లు సీజ్

- జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- బ్రిడ్జిలకు 500 మీటర్ల లోపు ఇసుక తవ్వితే చర్యలు

**సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)/కొవ్వూరు:** నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు కం రైలు వంతెనకు సమీపంలో సోమవారం ఇసుక తవ్వకాలు చేస్తున్న 18 బోట్లను సీజ్ చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. కొవ్వూరు ఏరినమ్మ ఘాట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కొవ్వూరు ఏరినమ్మ, ఔరంగబాద్–1 ఇసుక ర్యాంపులకు చెందిన పది, రాజమహేంద్రవరం దోభీఘాట్‌లో 8 బోట్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. బ్రిడ్జిలకు 500 మీటర్ల దూరంలో ఏవిధమైన తవ్వకాలు చేపట్టకూడదనే నిబంధన ఉంది. తెల్లవారు జాము నుంచే పడవల సాయంతో రోజూ ఇసుక త్వవకాలు చేస్తున్నారని జేసీ తెలిపారు. మైనింగ్, ఇరిగేషన్ అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సహకారంతో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తున్న బోట్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. బోట్ల నిర్వాహకులు తెలిసే ఈ తవ్వకాలు చేస్తున్నట్టు తమ విచారణలో వెల్లడైందన్నారు. బోట్లను సీజ్ చేయడమే కాకుండా యజమానుల పైన, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొవ్వూరులో సీజ్ చేసిన పది బోట్లను గోష్పాదక్షేత్రం లోని బోట్‌పాయింట్ వద్ద భద్రపరిచినట్లు ఏజీఆర్‌బీ డీఈఈ కె.ఆనంద్‌బాబు తెలిపారు. మైనింగ్ ఏడీ ఫణి భూషణ్‌రెడ్డి, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంఠరాజు, అధికారులు పాల్గొన్నారు.



పడవ యజమానులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

## రగ్బీ జట్ల ఎంపిక



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్ రగ్బీ బాలుర జట్టు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్‌జూనియర్ రగ్బీ బాలికల జట్టు

**కరప:** మండలంలోని గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సబ్ జూనియర్(అండర్–15) బాలురు, బాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కరప, పిఠాపురం, కొమరిగిరి, రామచంద్రపురం మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో జిల్లా జట్లు పాల్గొంటాయని హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగలింగేశ్వరరావు, పద్మ, శేషకుమారి, ఎల్.సతీష్, వంశీ, వీవీ రమణమూర్తి, ఐ.ప్రసాదరావు పర్యవేక్షణలో రగ్బీ జట్ల ఎంపిక నిర్వహించారు.

**అండర్–15 బాలుర రగ్బీ జట్టు**

డి.విజయకుమార్, వైవీఎస్ మణిదీప్, పి.వినయ్‌లోకేష్, కె.నాగవిష్ణు, వి.హేమంత్, ఎ.క్రాంతి, జె.గౌతమ్ అజయ్‌కృష్ణ, కేఎంఎస్ సాగర్, అభిరామ్, డి.విజయ్‌కుమార్, జె.ప్రేమ్‌కుమార్, కేపీ వలీషా, ఎ.గోవిందరాజు, జె.గౌతమ్ ఎంపికయ్యారు.

**అండర్–15 బాలికల రగ్బీ జట్టు**

వై.జ్యోతిచంద్రిక, ఎస్.వినీలా, ఎస్.చాందినీ, జి.తేజస్వి, పి.వీరలత దివ్య, పి.శృతి, జి.మణిరాజేశ్వరి, టి.చంద్రకళ, కె.అమృత, పి.లోలాక్ష్య దేవి, డి.అలేఖ్య, ఎస్.దీపిక, కె.అఖిల, టి.వీరలక్ష్మి, పి.నిహారిక, బి.శిల్ప ఎంపికయ్యారు.